క్లుప్తంగా

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

సూర్యాపేట : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ నాగభూషణం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఉత్సవ కమిటీలు, అధికారులతో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ మండపాల ఏర్పాటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ, ఆర్డీఓ వీరబ్రహ్మాచారి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కృపాకర్, మత పెద్దలు, పట్టణ సీఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను అణచివేసే కుట్ర



మాట్లాడుతున్న బోళ్ల కరుణాకర్

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్‌లను అణచివేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోళ్ల కరుణాకర్ ముదిరాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కేటాయించకుండా ముదిరాజ్‌లను విస్మరించిన సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కోల వనిత, పందిరి శ్రీనివాస్, ముదిరాజ్ మహాసభ యువత రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మర గోని రాజు, కట్ల సైదులు, కోల కర్ణాకర్, మహేష్, మూసి శ్రీనివాస్, మూసి మట్టయ్య, కృష్ణ, పరమేష్, నాగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

వెంకటేశ్వర్‌రావుకు సన్మానం

భానుపురి : ఇటీవల ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన గుడిపూడి వెంకటేశ్వర్‌రావును జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ మాట్లాడారు. వెంకటేశ్వర్‌రావు సీనియర్ న్యాయవాదిగా 36 సంవత్సరాల నుంచి ప్రజలకు సేవలందించి గొప్ప పేరు తెచ్చుకున్నారని, వారిని ప్రభుత్వ న్యాయవాదిగా నియమించడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో చార్లెట్ హోం వ్యవస్థాపకుడు జాటోత్ డేవిడ్ రాజు, చివ్వెంల మండల పాస్టర్స్ అధ్యక్షుడు గుగులోతు బాలాజీ నాయక్, సూర్యాపేట రూరల్ అధ్యక్షుడు యల్క ప్రభాకర్, ఆత్మకూరు సీనియర్ పాస్టర్ జలగం జేమ్స్, మార్క్, చెట్టుపల్లి దేవయ్య, బానోత్ సుధాకర్, సాంసన్ నాయక్, శ్యాగ యాకోబు, కొమ్ము హోసన్నా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నివాళి

నాగారం : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉపాధ్యాయుడు, పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సైరెడ్డి మల్లారెడ్డి(55) మృతదేహానికి వర్ధమానుకోట గ్రామంలో శనివారం పలువురు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చింతరెడ్డి, రామలింగారెడ్డి, మండల అధ్యక్షుడు కైరంకొండ రమేష్, జిల్లా ప్రసాద్, లక్ష్మణరావు, చక్రధర్, ఎల్లయ్య ఉన్నారు.

నివాళులర్పించిన ఎంపీపీ..

సైరెడ్డి మల్లారెడ్డి మృతదేహాన్ని జాజిరెడ్డిగూడెం ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్య యాదవ్ శనివారం వర్ధమానుకోటలో సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పర్సాయపల్లి ఎంపీటీసీ రాచకొండ గీతసురేష్, సర్పంచ్ బోయిని శోభలింగమల్లు, బండగొర్ల ఎల్లయ్య, యారాల రాంరెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు సైరెడ్డి మల్లారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడి మృతదేహానికి సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిపించిన అనంతరం శనివారం వర్ధమానుకోట గ్రామానికి తీసుకెళ్తూ మార్గమధ్యలో అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఎదుట కొద్దిసేపు పిల్లల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, సర్పంచ్ బైరబోయిన సునీతారామలింగయ్య, కనుకు శ్రీనివాస్, కడారి నరేష్, పులిచెర్ల ప్రభు, అర్వపల్లి కేజీబీవీ ఎస్‌ఓ నాగరాణి నివాళులర్పించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

తిరుమలగిరి : విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని తిరుమలగిరి మండల విద్యాధికారి ఐ.శాంతయ్య కోరారు. శనివారం అనంతారం మోడల్ స్కూల్‌లో జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేముల బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

మట్టి గణపతుల పంపిణీ

పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణ కోసం అందరూ మట్టి విగ్రహాలు వాడాలని సూర్యాపేట జిల్లాలో మంత్రి జగదీష్ రెడ్డి చేస్తున్న ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంటుంది. సూర్యాపేట జిల్లాలో అందరూ మట్టి విగ్రహాలని పూజించాలనే సంకల్పంతో మంత్రి జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు నుంచి ఐదు ఫీట్ల మట్టి విగ్రహాలను ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో అందిస్తున్నారు. అలాగే ఇంట్లో పూజించుకునే చిన్న విగ్రహాలను కూడా మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఉచితంగా అందిస్తున్నారు. ఈ చిన్న విగ్రహాలను ఇంట్లోనే నిమజ్జనం చేసుకునే అవకాశం ఉండగా.. నిమజ్జనం అనంతరం చిన్న పాటి మొక్కలు మొలవనున్నాయి.

- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో మట్టి విగ్రహాలు



చిన్న విగ్రహాలను తీసుకెళ్తున్న యువకులు



మట్టి విగ్రహాలను తీసుకెళ్తున్న ఉత్సవ నిర్వాహకులు

రజాకార్ల అడ్డా ‘ఏనుబాముల’

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణలో రజాకార్లు వ్యూహాత్మకంగా స్థావరాలను ఏర్పాటు చేసుకునే వారు. అప్పటి సూర్యాపేట తాలూకాలోని ఏనుబాముల గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని రజాకార్లు తమ ఆకృత్యాలు నడిపారు. ఈ గ్రామంలో అప్పట్లో ముస్లిం జనాభా అధికంగా ఉండడమే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. దీంతో రజాకార్లు చుట్టుపక్కల గ్రామాలపై దాడులు చేస్తూ తెలంగాణ సాయుధ పోరాట యోధులపై విరుచుకుపడేవారు. నాటి ఉద్యమంలో కీలకంగా ఉండే వ్యక్తులను పట్టుకుని ఏనుబాములకు తీసుకొచ్చి దారుణంగా హింసించేవారని సమాచారం. రజాకార్ల పోలీస్ క్యాంపు ఈ గ్రామంలోనే ఉండేది. ఆత్మకూరుకు చెందిన అప్పటి దళ సభ్యుడు గుణగంటి నరసయ్య, కొరియర్‌గా పనిచేసిన గిలకత్తుల వెంకటయ్యలను పట్టుకుని ఈ గ్రామ శివారులోనే కాల్చి చంపిన సంఘటన నాటి సాయుధ పోరాట ఘట్టంలో కీలకమైంది. ప్రస్తుతం ఈ గ్రామంలో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి సర్పంచ్‌గా పదవీ బాధ్యతల్లో ఉన్నాడు. రజాకార్ల అనంతరం 50 ఏళ్లుగా ఈ గ్రామంలో ఎలాంటి ఘర్షణ వాతావరణం లేకుండా అభివృద్ధిలో అందరూ కలిసి ముందుకు సాగుతున్నారు.

పోరాటంలో అసువులు బాసిన మద్దిరాల వాసులు



మస్తాన్ (ఫైల్)



బానోతు లచ్చిరాం(ఫైల్)

మద్దిరాల: తెలంగాణ సాయుధ పోరాటంలో మద్దిరాల మండలంలోని చందుపట్ల, మామిండ్లమడవ, గోరెంట్ల గ్రామాలు కీలకంగా వ్యవహరించాయి. మామిండ్లమడవ గ్రామం మల్లు స్వరాజ్యం అత్తగారి గ్రామం కావడంతో ఈ గ్రామం సాయుధ పోరులో ముందుంది. వీరితోపాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎందరో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. వీరిలో చందుపట్లకు చెందిన 12 మందిని నిజాం రజాకార్లు తీసుకెళ్లి ఎర్రపహాడ్ గడీలో కాల్చి చంపారు. అందులో ఒకరు తూటాల నుంచి తప్పించుకోవడంతో అతని కళ్లకు గంతలు కట్టి కాల్చి చంపారు. అనంతరం గ్రామ షేక్‌చిందుల ద్వారా మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా బీఎస్ నమ్మిన బంటైన చౌళ్ల తండాకు చెందిన బానోతు లచ్చీరాం తుపాకీ చేతపట్టి పోరాటం చేశారు. ఆ తర్వాత పోరాట యోధుల్లో లచ్చీరాం నాయక్, మస్తాన్ తదితరులు మరణించారు. అనంతరం చాలామందిమి జైలు జీవితం గడిపామని, సమరయోధుల పింఛన్ అందడం లేదని నేటికీ బతికున్న వారు అంటున్నారు.

గ్రామీణ స్థితిగతులపై అధ్యయనం



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సూర్యాపేట రూరల్ : గ్రామీణ కృషి అనుభవ్ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్‌లోని లయోలా అకాడమీ, మధ్యప్రదేశ్‌లోని ఓరియంటల్ యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయం, స్థితిగతులపై అధ్యయనం చేసినట్లు కేవీకే శాస్త్రవేత్త ఆకుల నరేష్ తెలిపారు. కాసరబాద గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. విద్యార్థినులు గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నట్లు తెలిపారు. గ్రామస్తుల సమస్యలకు గ్రామ పటం, వెన్ డయాగ్రమ్ చార్ట్, చిత్రాల రూపంలో విద్యార్థులు పరిష్కారం చూపినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జీడి భిక్షం, సర్పంచ్ కొల్లు రేణుక, నరేష్, ఎంపీటీసీ బంటు నాగమ్మ, సైదులు, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, నాగరాజు, రామకృష్ణ, చందు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన మేడి అనూష రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్ల పరుగు పందెం పోటీలకు ఎంపికైంది. నడిగూడెం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సూర్యాపేట జిల్లాస్థాయి అండర్-16 బాలికల విభాగం 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో అనూష ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఈ నెల 21న హనుమకొండలో నిర్వహించే ఖేలో ఇండియా సెలక్షన్ ట్రయల్స్, ఈ నెల 30, అక్టోబర్ 1న కరీంనగర్ జరిగే 9వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అనూష ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు తెలిపారు. అనూషను ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

ఓటుహక్కు నమోదుపై అవగాహన



ఓటుహక్కు నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

నాగారం : అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మీసేవా కేంద్రం వద్ద ఓటు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. 18ఏళ్ల నిండి యువత తప్పనిసరిగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో ఓటుహక్కు ఉన్న వారు కూడా ఓటరు జాబితాలో తమ పేరు సరిచూసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేరు లేకుంటే ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే అక్టోబరు-1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండే వారు కూడా ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ షాహిన్‌బేగం, ఏపీఓ ధార శ్రీనివాస్, ఆర్ఐ లక్ష్మీనర్సింహారావు, ఎంపీఎస్‌ఓ చింతమల్ల రమేష్, బీఎల్‌ఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటే..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంకినేని

పెన్‌పహాడ్ : బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీజేపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేస్తే కాంగ్రెస్ మద్దతుతోనే కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆపద కాలంలో ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవినీతిపై నిరంతరం పోరాటం చేస్తున్న బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకల రాములు, మండల నాయకులు తూముల సాము, తాళ్లపల్లి మధు, రాపర్తి వెంకన్నగౌడ్, ఆరె ప్రభాకర్, పిడమర్తి నాగయ్య, శ్రీను, వెంకటేష్, లింగయ్య, సంతోష్, మల్లేష్, నాగరాజు, వినోద్, పల్లయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కొనసాగిస్తాం



తుంగతుర్తిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి



పెన్‌పహాడ్ : సమావేశంలో మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు



నూతనకల్ : అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



తుంగతుర్తి : వెంపటిలో దాయం రాజిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



మద్దిరాలలో సాయుధ పోరాటయోధుడు వీరయ్యను సన్మానిస్తున్న కోట గోపి

తుంగతుర్తి : తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పద్మశాలిభవన్‌లో జరిగిన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన పోరాటం ఫలితంగానే ప్రజలకు దోపిడీ, పీడనల నుంచి విముక్తి కలిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, గోదాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, ఉప్పలయ్య, శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలి

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వెంపటి గ్రామంలో దాయం రాజిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా నేడు హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లంల యాదగిరి, మల్లేశ్వరి, మురగుండ్ల లక్ష్మయ్య, పాల్వాయి పున్నయ్య, తొట్ల ప్రభాకర్, రాజారాం, ఆకుల లింగయ్య, కోట రామస్వామి, దాయం సుజాత, ఝాన్సీరాజిరెడ్డి, ఎండీ ఫయాజ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా నాయకత్వంలోనే పోరాటం

పెన్‌పహాడ్ : రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన జెండా ఎర్ర జెండా అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సమావేశంలో పాల్గొని అమరవీరుల స్థూపాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో వేల మంది అమరులయ్యారని అన్నారు. ఈ సందర్భంగా సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిని, ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటున్న వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు చినపంగి నర్సయ్య, మడ్డి అంజిబాబు, వీరబోయిన రవి, బొమ్మిడి గోపిరెడ్డి, గుర్రం గోపాల్‌రెడ్డి, కొండమీది రాములు, నలబోలు గోపిరెడ్డి, వీరయ్య, వెంకన్న, గోపయ్య, వీరయ్య, వెంకటేశం, నాగేశ్వరరావు, బాల లింగమ్మ, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులదే సాయుధ పోరాట వారసత్వం

మద్దిరాల : తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగించేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శనివారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని తెలంగాణ సాయుధ పోరాట యోధులు కాటి వీరయ్య, ముత్తినేని కొండయ్యలను ఘనంగా సన్మానించారు. జి.కొత్తపల్లి, ముకుందాపురం, గోరెంట్ల గ్రామాల్లో అమరవీరుల స్థూపాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. మామిళ్లమడవ గ్రామానికి చెందిన సిరిపంగి మాస్తాన్, చౌళ్ల తండాకు చెందిన బానోతు లచ్చిరాం నాయక్, గోరెంట్ల గ్రామానికి చెందిన దీకొండ వెంకన్న, పాల్వాయి ఎల్లయ్య వంటి అనేకమంది యోధులు నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పులుసు సత్యం, సీపీఎం మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, పోలుజు సైదులు, కొంపెల్లి నాగయ్య, బొబ్బిలి వీరయ్య, రాంమూర్తి, సిరపంగి పున్నమ్మ, దీకొండ ఉపేందర్, జంపాల సైదమ్మ, మల్లయ్య, దేవయ్య, ఆశాలు, గజ్జెల్లి సత్తయ్య, గంధసిరి ఎల్లయ్య, నర్సయ్య, వీరయ్య, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల త్యాగఫలితమే స్వేచ్ఛ

నూతనకల్ : సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు చేసిన త్యాగ ఫలితంగానే తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్య్రాలు సమకూరాయని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా సమాఖ్య నాయకురాలు అనంతుల మల్లేశ్వరి, రైతు సంఘం నాయకులు మూరగుండ్ల లక్ష్మయ్య, తొట్ల ప్రభాకర్‌గౌడ్, రామ్మూర్తి, లింగయ్య, యాదగిరి పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కరపత్రాల ఆవిష్కరణ



భానుపురి : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆత్మకూరులో..

భానుపురి : ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ తెలిపారు. శనివారం స్థానిక ఖమ్మం క్రాస్ రోడ్డులో చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రావణ్ కుమార్, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ కత్తి ఉపేందర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్సూర్, పట్టణ అధ్యక్షుడు పిడమర్తి మధు, జిల్లా ఉపాధ్యక్షుడు పాతకోట్ల రమేష్, మామిడి కృష్ణ, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎస్) : పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను ఆ సంఘం నాయకులు శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అశోక్, మండల ఉపాధ్యక్షుడు సూరారపు నాగయ్య, ప్రధాన కార్యదర్శి ములకలపల్లి కాట య్య, జిల్లా ఉపాధ్యక్షుడు పాతకోట్ల రమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు మల్సూర్, భాషపంగు సత్యం పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రావణ్‌కుమార్ అన్నారు. సెప్టెంబర్ 21, 22 తేదీల్లో టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఒగ్గు రవి, కత్తి ఉపేందర్, నకిరేకంటి సైదులు, మామిడి కృష్ణ, సందీప్, ప్రభాకర్, రాజు, వీరయ్య, మహేష్, నాగరాజు, వెంకన్న, సురేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

చివ్వెంల : పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శనివారం 6వ రోజుకు చేరింది. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఎర్ర వీరస్వామి మాదిగ, బోడ్డు విజయ్, చెరుకుపల్లి సతీష్, సునీల్, కొంగల సతీష్, లింగస్వామి, రాజు, జ్యోతిబాబు, లింగయ్య, మహేష్, నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ కొండగడ్పుల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిటపాక చరణ్, పూల్లూరు సంపత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బొడ్డు శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత, బీసీ బంధు పథకాలను అర్హులకు కాకుండా అధికార పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపేట కాశయ్య, అరుణోదయ డివిజన్ అధ్యక్షుడు తడకమళ్ల సంజీవ, కాశీం పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తుంగతుర్తి : అంకితభావంతో పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ కవిత అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర, జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బోయిని లింగయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, ఎంపీడీఓ భీంసింగ్, తాటికొండ సీతయ్య, హెచ్ఎంలు యాకయ్య, రవీందర్, గురువయ్య, హరిక్రిష్ణ, మధు, కర్ణాకర్ పాల్గొన్నారు.

రూ.500 డీడీ చెల్లించాలి

అర్వపల్లి : గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా కోసం నిర్వాహకులు రూ.500 డీడీ చెల్లించాలని మండల విద్యుత్ ఏఈఈ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీడీలు చెల్లించే విషయమై స్థానిక విద్యుత్ సిబ్బంది నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. డీడీలు కట్టకుండా విద్యుత్ వాడవద్దని కోరారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి స్టేజీ వద్ద అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఈటూరు గ్రామానికి టెక్నో డీడ్ ఐటీ కంపెనీ చైర్మన్ వంగూరి దామోదర్ శనివారం రూ.20,000 విరాళం అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బుక్కరాజు తిరుపతి, తీగుళ్ల నర్సయ్య, గంట సోమిరెడ్డి, వంగూరి సోమయ్య, వంగూరి అబ్బులు పాల్గొన్నారు.

దివ్యాంగుల బంధు ప్రకటించాలి

అర్వపల్లి : దళిత బంధు మాదిరిగానే దివ్యాంగులకు దివ్యాంగుల బంధు పథకాన్ని ప్రారంభించాలని ఆలిండియా పుట్టు వికలాంగుల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కోనేటి వెంకన్న సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం అర్వపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గృహలక్ష్మి పథకంలో ఇళ్లు లేని దివ్యాంగులకు ఇళ్లను మంజూరు చేయాలని, విద్యుత్ బిల్లులు మినహాయింపు ఇవ్వాలని కోరారు. బ్యాంక్‌తో సంబంధం లేకుండా రూ.10 లక్షల సబ్సిడీ రుణం ఇవ్వాలన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్లు నెరవేర్చాలి



పెన్‌పహాడ్ : కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పెన్‌పహాడ్ : అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ భాస్కరమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ రణపంగ లలిత, మామిడి వసంత, లక్ష్మి, జానీభేగం, నాగలక్ష్మి, ఊర్మిల, బుజ్జమ్మ, జానకి, జయమ్మ, మంజుల, వెంకటమ్మ పాల్గొన్నారు.

తిరుమలగిరి : తమను సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించిన అంగన్‌వాడీలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్వప్న, కవిత, శోభ, నీలాబాయి, చంద్రకళ, అనిత పాల్గొన్నారు.

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ ప్రాజెక్టు నాయకురాలు స్వరూప అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఈ సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రాజారాంనాయక్, సీఐటీయూ నాయకులు బుర్ర శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మంగమ్మ, స్వరూప, శోభ, సునీత, రాణి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా గుర్తించాలి

నాగారం : ఆదర్శ పాఠశాలల్లో గంటల ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులను కాంట్రాక్టర్ ఉపాధ్యాయులుగా గుర్తించాలని కోరుతూ మోడల్ స్కూల్ గెస్ట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డబోయిన నాగరాజు శనివారం పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత 8ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా 194 ఆదర్శ పాఠశాలల్లో 1236 మంది గంటల ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారని అన్నారు. అవర్లీ బేసిక్ ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

సభను జయప్రదం చేయాలి

నాగారం : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఆదివారం జరిగే కాంగ్రెస్ విజయభేరి సభను జయప్రదం చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలమకంటి సోమన్న, తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు భాషపంగు భాస్కర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ పాల్గొనే సభకు తుంగతుర్తి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.వలీ, జక్కిలి నరేష్, హుస్సేన్, ఈశ్వర్, సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఆదివారం జరిగే కాంగ్రెస్ విజయభేరి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతం శనివారం ప్రకటనలో కోరారు. ఈ విజయభేరి సభకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, వివిధ రాష్ట్రాల సీఎంలు, రాష్ట్రాల కాంగ్రెస్ అధ్యక్షులు హాజరు కానున్నారని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు.